నవతెలంగాణ
ఆదిలాబాద్
1
గురువారం | జూన్ 13, 2024 | www.navatelangana.com

సొంత ఖర్చులతో చేతిపంపు ఏర్పాటు



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని గంగిపల్లి గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీలో నీటి ఇబ్బందులు గుర్తించిన స్థానిక ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు జలంపల్లి బానేష్ సొంత ఖర్చుతో చేతి పంపు ఏర్పాటు చేశారు. దళిత కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో సొంతంగా రూ.83వేలు ఖర్చు చేసి మంగళవారం రాత్రి చేతిపంపు ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి స్ఫూర్తితో ఎస్సీ కాలనీలో బోరు వేయించామని, ఎమ్మెల్యే చేతుల మీదుగా చేతి పంపును ప్రారంభిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ బాలురు బీసీ హాస్టల్‌లో 35 సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని వార్డెన్ జావేద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు బీసీ విద్యార్థులు హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9441908589 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంద్రవెల్లి : మండలంలోని బీసీ వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని హెచ్‌డబ్ల్యూఓ జావేద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3 నుండి 10వ తరగతి వరకు మొత్తం 68 ఖాళీలున్నాయని, ఆసక్తి గల విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువకరణ పత్రాలు అందజేసి ప్రవేశం పొందాలని తెలిపారు.

నామినేటెడ్‌పై నజర్..!

- ప్రారంభం కానున్న మార్కెట్ పదవుల పందేరం
- కొన్నింటికి నియామకం..మిగిలిన వాటిపై కదలిక
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు..త్వరలోనే ఉత్తర్వులు
- అధికార పార్టీ నాయకుల్లో ఆశలు

ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యమైన నామినేటెడ్ పదవుల సంబురం మళ్లీ మొదలు కాబోతోంది. జిల్లాలో కీలకమైన మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే కొన్ని మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించిన ప్రభుత్వం మిగిలిన వాటిని సైతం భర్తీ చేయాలని యోచిస్తోంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఇన్‌ఛార్జీ మంత్రి, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాధనలు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆయా కమిటీలకు వర్తించే రిజర్వేషన్ల ఆధారంగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి బలోపేతానికి కృషిచేస్తున్న వారి పేర్లను ఈ కమిటీల్లో నియమించేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఉమ్మడి జిల్లాలో కీలకమైన ఆదిలాబాద్ మార్కెట్ కమిటీకి సైతం నూతన చైర్మెన్‌తో పాటు ఇతర పాలకవర్గ సభ్యుల ఎంపిక పూర్తిచేసినట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నట్లు అధికార పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు పూర్తికావడంతో ఎన్నికల కోడ్ ముగిసిపోయింది. అధికారిక, ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు అవకాశం లభించింది. ఎన్నికల కోడ్ కారణంగా అర్థాంతరంగా నిలిచిపోయిన నామినేటెడ్ పదవుల పందేరం మళ్లీ ప్రారంభం కానుంది. దీంతో అధికార పార్టీకి చెందిన అనేక మంది నాయకులు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. తాజాగా మార్కెట్ పదవుల కేటాయింపుపై ప్రభుత్వంలో మళ్లీ కదలిక రావడంతో ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పదేండ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి.. పార్టీ బలోపేతం కోసం కృషిచేసిన నాయకులను ఈ కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ కమిటీల్లో నియమించే వారి పేర్లను పంపించే బాధ్యతను ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలకు అప్పగించింది. వీరు సూచించిన వారికే పదవులు కట్టబెట్టాలని యోచిస్తోంది. దీంతో అనేక మంది ఆశావహులు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలను ప్రసన్నం చేసుకుంటూ పదవులు కేటాయించాలని కోరుతున్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకు నమ్మకంగా ఉండటంతో పాటు వారి ప్రధాన అనుచరులకే ఈ పదవుల్లో ప్రాధాన్యం దక్కనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

త్వరలోనే అధికారిక ఉత్తర్వులు..!

జిల్లాల్లో ఎమ్మెల్యేల తర్వాత మార్కెట్ కమిటీ పదవులకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే గత సర్కారు నియమించిన నామినేటెడ్ పదవులన్నింటినీ రద్దు చేసింది. మళ్లీ కొత్తగా వీటిని చేపట్టాలని నిర్ణయించింది. కొన్ని కార్పొరేషన్లకు పాలకవర్గాలను నియమించిన ప్రభుత్వం మిగితా వాటిని కూడా భర్తీ చేయాలని భావిస్తోంది. తాజాగా జిల్లాల్లో మార్కెట్ కమిటీ పదవులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 18 మార్కెట్ కమిటీలు ఉండగా.. అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే మంచిర్యాల, లక్షెట్టిపేట, కాగజ్‌నగర్, బోథ్ కమిటీలకు పాలకవర్గాలను నియమించగా.. మిగతా ఇచ్చోడ, జైనథ్, ఆదిలాబాద్, నిర్మల్, సారంగపూర్, ఖానాపూర్, కుభీర్, భైంసా, జన్నారం, చెన్నూర్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, జైనూర్ మార్కెట్‌లకు నియమించాల్సి ఉంది. ప్రభుత్వానికి ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు నాయకుల పేర్లు సిఫార్సు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మార్కెట్ కమిటీల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరనున్నట్లు తెలుస్తోంది.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని లక్కారం ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతోందన్నారు. పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అత్యాధునిక టెక్నాలజీ వాడి విద్యా బోధనను అందిస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పడానికి ప్రతి పాఠశాలలో గ్రీనరీలు ఏర్పాటు చేయాలన్నారు. లక్కారం పాఠశాలలో ఎస్డీఎఫ్ ఫండ్ ద్వారా అదనపు గదులతో పాటు టివి, కంప్యూటర్ ఇస్తామని హామీ ఇచ్చారు.

సత్ఫలితాల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి అవసరం



నవతెలంగాణ-జైపూర్

విద్యార్థులు సత్ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయుల కృషికి తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని భీమారం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు అభిప్రాయపడ్డారు. 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థిని హెప్సీబా 9.8 గ్రేడ్ పాయింట్స్‌తో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెప్సీబాను అభినందిస్తూ సన్మానించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు గోవర్ధనాచారి, శ్రీనివాస్‌రావు, తిరుపతి, పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ రీ వాల్యుయేషన్ నిబంధనలు సడలించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇంటర్ రీవాల్యుయేషన్‌లో నిబంధనలు సడలించాలని వివేకానంద జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హనుక్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ రీ వాల్యుయేషన్‌లో పెట్టిన నిబంధనల్లో విద్యార్థులు రాసి జవాబుల్లో సున్న మార్కులు వచ్చిన వాటికే పరిగణలోకి తీసుకొని పెంపు చేసే అవకాశం ఉండటాన్ని వెంటనే ఎత్తి వేయాలన్నారు. ఒక్కసారి మార్కులు వేసిన జవాబు పత్రాల్లో ఎలాంటి మార్పు చేయక పోవటం దారుణమని పేర్కొన్నారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థిని అంజూమ్ షహీన్ ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో వచ్చిన మార్కులు జాబితాలో అన్నీ సబ్జెక్టుల్లో 95 శాతం రాగా, ఫిజిక్స్‌లో మాత్రం 50 శాతం మార్కులు రావటంతో రీవాల్యుయేషన్ పెట్టినట్టు వివరించారు. తమకు జవాబు పత్రాలతో కూడిన కాపీ వచ్చిందన్నారు. ఇందులో ఎలాంటి మార్పులు చేయకుండా యధావిధిగా పంపించినట్టు పేర్కొన్నారు. ఈ విషయమై తాము ఆరా తీయగా నిబందనలు విద్యార్థులకు అన్యాయం జరిగేట్టు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా భారత రాజ్యంగం ఆర్టికల్ 14, 15, 21 ప్రకారం రీవాల్యుయేషన్ చేయాలని కోరారు. ఈ మేరకు డీఐఈఓ లిఖిత పూర్వకంగా వినతిపత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థిని అంజూమ్ షమీనకు ఇంగ్లీష్‌లో 100కు 95 మార్కులు వచ్చినట్టు, హిందిలో 100కు 99, బోటనీలో 60కి 60, జూవాలోజీలో 60కి 60, ఫిజిక్స్‌లో 60కి 32, కెమిస్ట్రీలో 60కి 59 వచ్చినట్టు తెలిపారు. నిబంధనలు సడలించి రీ వాల్యుయేషన్ చేస్తే విద్యార్థినికి న్యాయం జరుగుతుందన్నారు.

విద్యుత్ వైర్లు తెగి మూడు గేదెలు మృతి

బెజ్జూర్ : మండలంలో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో కూడిన గాలివానతో మండలంలోని నాగపెల్లి, కోయపల్లి, ఇప్పలగూడ, నాగపల్లి సోమినీ గ్రామాల్లో వర్షం రావడంతో ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. రోడ్లపై చెట్లు పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రంలో గోల్కొండ గ్రామంలో విద్యుత్ వైర్లు తెగిపడి అప్పల వెంకమ్మకు చెందిన మూడు గేదెలు మరణించాయి. దీంతో సుమారు రూ.రెండు లక్షల నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు స్పందించి సర్వే చేసి బాధిత కుటుంబాలకు పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

సిర్పూర్(టి): మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. బుధవారం ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధికారులు వారివారి శాఖల ప్రగతి నివేదికల చదివి వినిపించారు. ఇన్‌చార్జి ఎంపీఓ కృష్ణమూర్తి తన నివేదికను చదివి వినిపించారు. మండలంలో వివిధ గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధుల గురించి వివరణ కోరగా సిర్పూర్ గ్రామపంచాయతీ సంబంధించిన రైతు వేదిక భవన నిర్మాణ నిధులు సదరు కాంట్రాక్టర్ అవకతవకలు జరగాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్, తహెరా బేగం, ఎల్ములే సరిత, కర్మాన్‌కర్ తుకారాం, లావుద్యా మంగిలాల్, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలు పున:ప్రారంభం

కాసిపేట : మండలంలో బుధవారం పాఠశాలలు పున:ప్రారంభమయ్యాయి. దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్ చేతుల మీదుగా విద్యార్థులకు నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందించారు. గత ఏడాది రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనభరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మెరుగు పద్మ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ములకల ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకటేశ్వరస్వామి అధ్యక్షతన నిర్వహించిన బడిబాటలో విద్యార్థులకు నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్‌ను తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్ అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, జ్యోతి, పల్లె కృష్ణగోపాల్‌రావు, మాధవీలత, అనసూయ, అర్చన పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-నిర్మల్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలపు అంటువ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం పంచాయతీరాజ్, వైద్య శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్లు, ముఖ్య కూడళ్లు, డ్రైనేజీలలో వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, అతిసార, అమీబియాసిస్ వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామాల్లో పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. క్లోరినేషన్ చేపట్టిన తర్వాతే ప్రజలకు మంచినీటిని, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య సిబ్బంది తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలని, వారానికి రెండు రోజులు డ్రై డే పాటించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

ఆశా, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి, పారిశుధ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 12 నుండి 19 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహించాలని ఆదేశించారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు వసూలు చేసిన ఇంటిపన్ను, పెండింగ్ పనులను మండలాల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారిగా పూర్తయిన సర్వే వివరాలు సమీక్షించారు. సమావేశంలో డిపిఓ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో గోవింద్, డిఎంహెచ్ఓ డాక్టర్ ధన్‌రాజ్, డీఆర్డీవో విజయలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టును భయపెట్టడాన్ని ఖండిస్తున్నాం : జేఏసీ

- నల్లబ్యాడ్జీలతో కాంగ్రెస్ వార్తల కవరేజీ
- క్షమాపణ చెప్పాలని డిమాండ్



మాట్లాడుతున్న జర్నలిస్టు జేఏసీ కన్వీనర్ దేవేందర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రముఖ ఛానల్‌కు చెందిన స్టాఫ్ రిపోర్టర్ ఓ కథనాన్ని ప్రసారం చేయడంతో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు సదరు రిపోర్టర్‌పై అట్రాసిటీ కేసు పేరుతో భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదిలాబాద్ జర్నలిస్టు జేఏసీ చైర్మెన్ నూకల దేవేందర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు టీవీలో వచ్చిన వార్త ఆధారంగా రిపోర్టర్‌పై అట్రాసిటీ కేసు నమోదుకు యత్నించగా పోలీసులు కూడా అత్యుత్సాహాన్ని ప్రదర్శించారని తెలిపారు. కలానికి కులాన్ని అంటగట్టి, జిల్లాలో రిపోర్టలను భయభ్రాంతులకు గురి చేసేలా అధికార పార్టీ వ్యవహరిస్తోందని, దీనికి పోలీసులు కూడా వత్తాసు పలకడం సరికాదని అన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ అధికార పార్టీ కార్యక్రమాలకు నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరు కావడానికి నిర్ణయించినట్లు తెలిపారు. అట్రాసిటీ కేసు బనాయించేందుకు వెనక నుంచి నడిపించిన నాయకులు రిపోర్టర్‌కు క్షమాపణ చెప్పే వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు, రాజకీయ నాయకులకు సూచిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ వెంకటేష్, స్టాఫ్ రిపోర్టర్‌లు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, కెమెరామెన్‌లు, ఫొటోగ్రాఫర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు



నవతెలంగాణ-తాంసి

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఉచితంగానే అందించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ పున:ప్రారంభం సందర్భంగా పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులను మండల అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మంచి విద్య, భోజనం అందించడంతో పాటు ఉచితంగా దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లలకు పైచదువుల్లో, ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని, ఉపాధ్యాయులు గ్రామాల్లో చదువు మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్చుకోవాలని పేర్కొన్నారు. భీంపూర్ మండలంలో అన్ని పాఠశాలలు పున:ప్రారంభం అయ్యాయి. ఎంపీపీ రత్నప్రభ సంతోష్ పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, మండల విద్యాధికారి శ్రీకాంత్, ఏపిఎం రవీందర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భూములకు మార్కెట్ రేటుతో నష్టపరిహారం చెల్లించాలి

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బాధిత రైతులు



నవతెలంగాణ-జైపూర్

నాగాపూర్-వైజాగ్ మధ్య నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో నష్టపోతున్న భూములకు బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని వివిధ గ్రామాలకు చెందిన రైతులు బుధవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో రసూల్‌పల్లి నుండి పౌనూర్ వరకు గల విలువైన వ్యవసాయ భూములను నష్టపోతున్నామన్నారు. అతి తక్కువ నష్టపరిహారం చెల్లించడానికి ఎంతమాత్రం వీలులేదని పేర్కొన్నారు. స్థానికంగా అమ్ముడవుతున్న భూముల మార్కెట్ రేటును పరిగణలోకి తీసుకోవాలని కోరారు. హైవే నిర్మాణంలో నష్టపోతున్న భూముల విలువ ప్రస్తుతం రూ. 40 లక్షల నుండి రూ.కోటి వరకు పలుకుతోందని కలెక్టర్‌కు విన్నవించారు. కిష్టాపూర్ శివారులో నిర్మించిన లక్ష్మి బ్యారేజ్‌లో నష్టపోయిన భూములకు అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.8.20లక్షలు చెల్లించిందని, ఇందారం ఓపెన్‌కాస్ట్ గని విస్తరణకు సింగరేణి యాజమాన్యం సేకరించిన భూములకు ఎకరాకు రూ.24లక్షల చొప్పున పరిహారం చెల్లించిందని గుర్తు చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నర్సింగరావు, సంతోషం సురేఖ, చందుపట్ల జనార్ధన్‌రెడ్డి, కటుకూరి రాంరెడ్డి, కృష్ణమూర్తి, బోయిని సంపత్, కొరకొప్పుల శ్రీనివాస్ గౌడ్, మాదాడి సాగర్‌రెడ్డి, కటుకూరి నారాయణరెడ్డి ఉన్నారు.

నీటి సరఫరాలో ప్రెషర్ పెంచాలి

- భీమారం ఎంపీడీఓ రాధ రాథోడ్



నవతెలంగాణ-జైపూర్

భూర్గుపల్లి, భీమారం గ్రామ పంచాయతీల పరిధిలో మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నప్పటికీ ఎగువ ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని సరఫరాలో ప్రెషర్ పెంచాల్సిన అవసరాన్ని గుర్తించినట్లు ఎంపీడీఓ రాధ రాథోడ్ అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్‌తో కలిసి బుధవారం భూర్గుపల్లి, భీమారం గ్రామ పంచాయతీల పరిధిలో గల వివిధ వార్డుల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా తీరుపై సర్వే నిర్వహించారు. నీటి సరఫరా కొనసాగుతున్నప్పటికీ ఎగువ ప్రాంతాలకు ప్రెషర్ లేకపోవడాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఇంటింటా నీటి సరఫరా, సదరు కుటుంబానికి సంబంధించిన వ్యక్తి ఆధార్ కార్డు వివరాలను సర్వే యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ సర్వేను పంచాయతీ కార్యదర్శులతో పాటు ఐకేపీ, ఉపాధి హామీ సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం భూర్గుపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి బడీడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతుల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అవకాశం

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి యాజమాన్యం 2024 ఫిబ్రవరి 23న విడుదల చేసిన ఎక్స్‌టర్నల్ ఎంప్లాయిమెంట్ కొనసాగింపుగా మైనింగ్ బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ సవరణలు విడుదల చేసింది. బీటెక్ ఫైనల్ ఇయర్ మైనింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ నెల 13 నుండి 16 వరకు సింగరేణి వెబ్‌సైట్ ద్వారా మేనేజ్మెంట్ ట్రైనింగ్ ఉద్యోగానికి దరఖాస్తుకు అవకాశం కల్పించింది. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం, వివరాలను తెలుసుకోవడానికి సింగరేణి విడుదల చేసిన నోటిఫికేషన్ చూడాలని జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సిటిఆర్ దీక్షితులు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | జూన్ 13, 2024 | www.navatelangana.com

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జైనథ్



మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎంపీపీ మర్సెట్టి గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సభ సమావేశం సాదాసీదాగా కొనసాగింది. గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ఎంపీటీసీలతో సమావేశాన్ని కొనసాగించారు. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు ప్రగతి నివేధికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్క శాఖల అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, ఎంపీడీఓ ఏ.రవీంద్రనాథ్, తహసీల్దార్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్టు అందజేత

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన పల్సి-కే గ్రామ యువకులకు ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పోలీసులు వాలీబాల్ కిట్‌ను అందించారు. జిల్లా పోలీసు అధికారి ఆదేశాల మేరకు గ్రామంలోని యువతకు స్ఫూర్తిని నింపడానికి వాలీబాల్ కిట్టును ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిందర్ యువకులకు అందజేసి క్రీడాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బి.సురేందర్, హెడ్ కానిస్టేబుల్ ఠాకూర్ జగన్‌సింగ్, గ్రామ పటేల్ నైతం రాము, మహాజన్ ఉత్తం, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సురేందర్ యాదవ్, పాల్గొన్నారు. ముందుగా గ్రామ యువకులు పాఠశాలలోని పరిసర ప్రాంతాలను శ్రమదానం నిర్వహించి చెత్తాచెదారాన్ని పిచ్చి మొక్కలను తొలగించారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారుల విచారణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కైలష్ నగర్‌లో స్థలం కబ్జాకు గురవుతుందని కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ల త్రిమెన్ కమిటీ వేసి విచారణ చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఇన్‌చార్జీ ఆర్డీఓ జీవకర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, రెవెన్యూ అధికారులు ధస్నాపూర్ శివారులోని సర్వే నంబర్ 21/4ను సందర్శించి విచారణ చేపట్టారు. సదరు వ్యక్తి వద్ద పత్రాలున్నయని చెబుతున్న అధికారులు ముందుకు రాలేదన్నారు. సమయంలోగా పత్రాలు చూపని క్రమంలో విచారణ వివరాలను కలెక్టర్‌కు తెలియజేస్తామని ఇన్‌చార్జీ ఆర్డీఓ తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, అభివృద్ధి కమిటీ వివరాలు ఇచ్చిందన్నారు. ఎదుటి వ్యక్తి ఇంకా పత్రాలు సమర్పించలేదన్నారు. ఈ సందర్భంగా కైలష్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లోక ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ 1971లో కైలష్ మిశ్ర 20 ఎకరాల్లో ప్లాటింగ్ చేశారని తెలిపారు. అయితే అప్పట్లోనే 8 ప్లాట్లను కాలనీ అభివృద్ధికి ఖాళీగా పెట్టారన్నారు. భూ మాఫియ దాన్ని కబ్జా చేసేందుకు యత్నించిందన్నారు. కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్ వేస్తున్న క్రమంలో మున్సిపల్ అధికారులకు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారన్నారు. ఇదే విషయమై కలెక్టర్‌కు విన్నవించగా ఆయన స్పందించి కమిటీ వేసి విచారణ చేపట్టారన్నారు.

ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎంబీబీఎస్‌లో సీట్ సాధించిన విద్యార్థులను బుధవారం కలెక్టర్ రాజర్షి షా తన ఛాంబర్‌లో సన్మానించారు. ఎంఎస్ నీట్ అకాడమీ, సేవా ఫౌండేషన్ 2024, క్రిసెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు నీట్‌లో మొదటి సారిగా జిల్లా నుండి 11 మంది ర్యాంక్ సాధించిన సందర్భంగా అభినందించి శాలువాతో సన్మానించారు. ఇక్రా అక్బాని 642, అమీమా ఫిరాజ్ 543, హాదీయ తస్నిం 538, అయిమన్ ఖానం 492, మహేక్ నాజ్ 462 మార్కులు సాధించారు. వీరంతా ఆదిలాబాద్‌లో గల ఎంఎస్ నీట్ క్రిసెంట్ జూనియర్ కాలేజీలో చదివారు. వీరితో పాటు వివిధ ప్రాంతాలలో అబ్దుల్ అబ్బాస్ 624, హుమేరా ఖానం 537, సాయిఫా తబస్సుమ్ 579, షబియా 509, మరియం 472, బుష్‌రా సుల్తానా 453 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువును పూర్తి చేసి తమ తల్లిదండ్రుల, అధ్యాపకుల, జిల్లా పేరును నిలబెట్టాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో క్రిసెంట్ జూనియర్ కాలేజ్ చైర్మన్ మొహమ్మద్ బిలాల్, ఎంఎస్ నీట్ అకాడమీ డైరెక్టర్ ఎంఎ రఫీ, సేవా ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు షఫిక్ అహ్మద్ అత్తర్, అధ్యక్షులు ఖాజా సిరాజొద్దీన్, రిజ్వాన్‌ఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని ప్రతి పాఠశాలలో ప్రతి ఒక్క విద్యార్థికి సకాలంలో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్ అందించాలని ఎంఈఓ ఉదయ్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో 77 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఒకే రోజు 10 పాఠశాలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేస్తామన్నారు. బడిబాట కార్యక్రమం అన్ని గ్రామాల్లో విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేటుకు దీటుగా విద్యను, మౌలికమైన సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిఓ సురేష్, సిఆర్పి రవీందర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఐకేపీ ఏపీఎం లింగంపల్లి గంగన్న కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిత్యం ప్రజల శ్రేయస్సు కోరే మంచి మనిషి గంగన్న అని అన్నారు. ఇలా ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- కలెక్టర్ రాజార్షి షా
- నేనూ ఆశ్రమ పాఠశాలలోనే చదివాను : ఎమ్మెల్యే బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని కలెక్టర్ రాజార్షి షా అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రయిమరీ పాఠశాల-1ను సందర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి పాల్గొన్నారు. ముందుగా ప్రొ.జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళాశక్తికు పెద్ద పీఠ వేశారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో మహిళలకు చోటు కల్పించి విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే ఏకరూప దుస్తులకు కుట్టే బాధ్యత మహిళ సంఘాలకే అప్పగించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, ఏకరూప దుస్తులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం తాగు నీరు, మరుగుదొడ్లు, మూత్ర శాలలు వంటి సౌకర్యాలతో పాటు పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాల్లో మొత్తం 664 ప్రభుత్వ పాఠశాలతో పాటు ఐటీడీఏ పరిధిలోని 444 పాఠశాలలో మౌలిక వసతులకోసం నిధులను మంజూరు చేసిందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో తొలిమెట్టుతో పాటు ప్రతి మూడవ శనివారం నాడు పోషకులతో సమావేశం నిర్వహించాలన్నారు.

నేను సైతం ఆశ్రమ పాఠశాలలోనే చదివాను : ఎమ్మెల్యే

తాను కూడా ఆశ్రమపాఠశాలలోనే చదివానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. ప్రయివేటు పాఠశాలలో ఇంగ్లీష్ మోజుతో అధిక ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పుడే ప్రభుత్వ పాఠశాలలు ప్రయివేటుకు ధీటుగా విద్యానందిస్తుందన్నారు. ప్రభుత్వం ఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్‌టీ నిధుల కింద పాఠశాలలో మౌలిక వసతులను కల్పిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరంగా బడికి పంపించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 147 మంది విద్యార్థులకు ఏక రూప దుస్తులు, పుస్తకాలను అందజేశారు. అనంతరం మిషన్ భగీరథ నల్లాల సర్వేను పరిశీలించారు. కార్యక్రమములో డీఆర్డీఓ సాయన్న, ఆర్డీఓ జీవకార్ రెడ్డి, ఎంఈఓ నారాయణ, ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీపీ శోభా, జడ్పీటీసీ పుష్పలత, హెచ్ఎంలు రామ్ మోహన్, చిత్రు, సీడీపీఓ శ్రావణి, పాఠశాల చైర్మన్ వర్షా బాయి, ఏఈలు జాడి మల్లేష్, భాను కుమార్ పాల్గొన్నారు.

పదిలో మంచి ఫలితాలు రావడం అభినందనీయం

- జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్



నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో మంచి మార్కులు రావడం అభినందనీయమని జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. బుధవారం పాఠశాల పున:ప్రారంభం సందర్భంగా ఆయన మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. అదే విధంగా పాఠశాలలోని సమస్యలను కో ఆప్షన్ మెంబర్ దస్తగిరి జడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకురాగా పరిష్కరించేల కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. వారం రోజుల క్రితం వెలువడిన నీట్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన మన్సూర్ ఖాన్ కుమారుడు ముజమ్మిల్ ఖాన్ దేశ వ్యాప్తంగా 720లకు గానీ 633 మార్కులు సాధించాడు. విద్యార్థిని శాలువాతో సన్మానించారు. ప్రభుత్వ బడిలో చదివి నీట్‌లో ర్యాంక్ సాధించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాధవ్ శ్రీరామ్ నాయక్, ప్యాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడే, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, డీఎల్పీఓ కే గంగాధర్, ఎంఈఓ అశన్న, ఎంపీఓ ఆనంద్ కుమార్, ఏపీఎం రమేష్, పాఠశాలల హెచ్ఎం పవార్ అనిత, చినప్ప రెడ్డి, ఉపాధ్యాయులు ప్రేమ్ సింగ్, నాయకులు కనక ప్రభాకర్, సయ్యద్ ఖాసిం, బాబాఖాన్ పాల్గొన్నారు.

విత్తనాలు బ్లాక్ మార్కెట్‌లో అమ్మితే చర్యలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



డీలర్లు విత్తనాలను కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజార్షి షా డీలర్లను హెచ్చరించారు. బుధవారం ఆయన పత్తివార్ కృషి కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులు కొన్న వివిధ రకాల విత్తనాల గురించి అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా అమ్మకాలు, స్టాక్ రిజిస్టరును తనిఖీ చేశారు. అనంతరం డీలర్లు తెచ్చిన వివిధ రకాల విత్తనాల నిల్వ గదులను పరిశీలించారు. రైతులకు అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటే చర్యలు తప్పవన్నారు. డీలర్లు ఇచ్చిన రసీదును జాగ్రత్తగా భద్రంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జీ ఎఓ అరుణ, వివిధ శాఖల అధికారులున్నారు.

లోకేశ్వరం : మండలంలోని బిలోలి గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఉమేశ్ ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడాలని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ రైతులు కాంతారావు, ప్రభాకర్ రావు, మల్లేష్, పండరి శ్రీకాంత్, ప్రశాంత్, బోజన్న, నర్సయ్య, గ్రామ యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవ తెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులు పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీఎంఆర్సీ భవనంలో ట్రైబల్ వెల్ఫేర్ బెస్ట్ అవైలేబుల్ పాఠశాలలో విద్యార్థుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృషి పట్టుదల కష్టపడేతత్వం ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల పాఠశాలలు, ట్రైబల్, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల అభివృద్ధి కృషి చేస్తోందన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులకు కోరారు. చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం లక్కీడ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక చేశారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ డీడీ దిలీప్ కుమార్, జడ్పీటీసీ చారులత రాథోడ్, ఎంపీపీ జైవంత్ రావు, అధికారులు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకుంటు పరిష్కరమే లక్ష్యంగా పని చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహన్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో వినియోగదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు వారి సమస్యలను తెలియజేస్తూ వినతులను అందించారు. పరిష్కారం కోసం వెంటనే లైన్మెన్లకు వాటిని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఈ జేఆర్ చౌహన్ మాట్లాడుతూ వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సంస్థ ఎండీ ఆదేశాల మేరకు ఫిర్యాదుల విభాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఎర్తింగ్ పెట్టుకొవాలని, లేని పక్షంలో కరెంట్ షాక్‌లకు గురవుతారన్నారు. అదే విధంగా ఏదైన విద్యుత్ సమస్య ఉంటే తమ సిబ్బందికి తెలియజేయాలని, ప్రయివేట్ వ్యక్తులను ఆశ్రయించవద్దని సూచించారు. గడువులోపు కరెంట్ బిల్లులను సకాలంలో చెల్లించాలని సూచించారు. సీఎండీ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం ఎస్ఈ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ డి.శంకర్, అసిస్టెంట్ డీఈ శివప్రసాద్, ఏఏఓ కే. ప్రదీప్, ఏఈ నమ్రత, ఏఏఈ సదానందం పాల్గొన్నారు.



ముందుగానే సన్నద్ధం చేస్తే మరింత ఫలితాలు

- ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్
- విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తొమ్మిదవ తరగతి నుండి పదవ తరగతికి విద్యార్థులు రాగానే మంచి మార్కులు, జీపీఏలు సాధించాలని ఒత్తిడి చేస్తున్నారని, అదే 8వ తరగతి నుంచే విద్యార్థులను పదవ తరగతికి సన్నద్ధం చేస్తే మరింత మంచి ఫలితాలు వస్తాయని ఎంపీ గోడం నగేష్ అభిప్రాయపడ్డారు. బుధవారం పట్టణంలోని మహాలక్ష్మీవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందించారు. పాఠశాలకు వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యే పాయల శంకర్‌ను శాలువతో సత్కరించారు. అంతకు ముందు పదవ తరగతిలో 9 జీపీఏ సాధించిన పాఠశాల విద్యార్థులను ఎంపీ, ఎమ్మెల్యేలు సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ పదవ తరగతిలోనే విద్యార్థులను మంచి మార్కులు సాధించాలని ప్రత్యేక తరగతులు లాంటి నిర్వహిస్తున్నారని, అదే విధానాల్లో మార్పు రావాల్సి అవసరముందన్నారు. 8వ తరగతి నుంచే విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. ఆదిశగా విద్యాశాఖతో పాటు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. పూట గడవడమే కష్టంగా ఉన్న కూలీల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వస్తారన్నారు. వారికి మంచి విద్యను అందిస్తునే ప్రయివేటు ధీటుగా వసతులు కల్పిస్తున్నామనే నమ్మకం కలిగించాలన్నారు. ఎమ్మెల్యే పాయల్ మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే విద్యార్థులను సొంత పిల్లల భావిస్తు ఉపాధ్యాయులు బోధనలు అందించాలన్నారు. గతంలో ఉద్యోగం కోసమే చదివే వారన్నారు. కానీ ఇప్పుడు మానవ మనుగడ సాగాలంటే విద్య అవసరమన్నారు. ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుంటు మంచి విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. ప్రయివేటు ధీటుగా బోధనలు, సౌకర్యాలున్నాయన్న నమ్మకం తల్లిదండ్రుల్లో కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఎంఈఓ జయశీల, బీజేపీ నాయకులు మహేందర్, ఆధినాథ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల కాలేయ వ్యాధితో బాదపడుతూ మరణించిన మదస్తు రాకేష్ కుటుంబ సభ్యులకు మున్నూరు కాపు మానవత వాదులు ముందుకు వచ్చి అండగా నిలిచారు. స్వచ్చందంగా విరాళాలు అందించడంతో సేకరించిన రూ.లక్షను ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్‌ను బుధవారం మున్నురుకాపు సంఘ భవనంలో కుటుంబ సభ్యులకు అందించారు. విరాళాల సేకరణలో ముఖ్యపాత్ర పోశించిన గంద్రత్ సంతోష్, బండారి ప్రమోద్‌లను తాలుక అధ్యక్షుడు కాళ్ల విఠల్ అభినందనించారు. ఈ సందర్భంగా గంద్రత్ సంతోష్ మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘంలో చురుగ్గ ఉంటూ కాలేయ వ్యాధితో బాధపడుతు రాకేష్ మరణించడం బాధాకరమన్నారు. ఆయనతో తమకున్న సంబంధంతో మున్నురుకాపు సంఘం సభ్యులు ముందుకు వచ్చి విరాళాలు అందించిందినందుకు ధన్యావాదలు తెలిపారు. రాకేష్ తల్లిదండ్రులు వృద్దులని వారి పేరిట రూ.లక్ష చేశామన్నారు. వారికి అవసరమున్న సమయంలో దాన్ని తీసుకోవచ్చుని తెలిపారు. కార్యక్రమంలో అరుణ్, అన్నం ప్రభాకర్, కమ్మల సంతోష్, ప్రభాకర్, విఠల్, కోరెడ్డి శంకర్, తిరుపతి, స్వప్నిల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాఠశాలల అభివృద్ధి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ ప్రభుత్వంలో మన ఊరు మనబడి, మన బస్తి మనబడి పథకాలతో పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అధునాతన సౌకర్యాలు కల్పించామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు.. బుధవారం పట్టణంలోని వార్డ్ నెం 49లో గల ప్రైమరీ స్కూల్లో బడిబాట కార్యక్రమాన్ని వార్డ్ కౌన్సిలర్ ప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు దుస్తులను అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాఠశాలల పునర్నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పించామన్నారు. అలాగే ప్రతి పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాల పిల్లలకు సైతం ఇంగ్లీష్ విద్య, డిజిటల్ తరగతుల బోధనను అందించడం జరిగిందన్నారు. పోషకాలతో కూడిన మార్నింగ్ సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకంతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తూ ఉన్నత విద్యకు పాటుపడిందన్నారు. కార్యక్రమంలో డిఈవో ప్రణీత, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ ఖమర్ అహ్మద్, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వం అందించే ప్రోత్సహకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు సంబంధించిన లక్కీ డ్రాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కీడ్రాలో ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ లక్కీ డ్రాలో భాగంగా జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో 49 ఉచిత ప్రవేశాలకు బాలికలు 16, బాలురు 33 మంది విద్యార్థిని, విద్యార్థులను ఎంపిక చేశారు. ఐదవ తరగతిలో ప్రవేశాలకు 52 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో డిఆర్ఓ భుజంగరావు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి రాజేశ్వర్‌గౌడ్, ఏఎస్ఓ లత, సూపరింటెండెంట్ శ్రీదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని మురళిగూడ గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సమయానికి రాకపోవడంతో పాఠశాలలో విద్యార్థులు పాఠశాలకు వెళ్లి వెనుదిరిగారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలి రోజు సమయానికి రావాల్సిన ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యా సంవత్సరం ప్రారంభమైన రోజే వెనుదిరిగారు. పాఠశాలకు ఉదయం 10 దాటిన ఉపాధ్యాయులు ఆలస్యంగా రావడంతో పాఠశాల తెరుచుకోలేదు. మండలంలో పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని గ్రామస్తులు అంటున్నారు.

బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-కౌటాల



కౌటాలకు గ్రామానికి చెందిన గాండ్ల శ్రీనివాస్ చనిపోవడంతో ఆయన భార్య మేఘరాణికి రూ. 2లక్షల బీమా చెక్కును తెలంగాణ గ్రామీణ బ్యాంకు కౌటాల శాఖ మేనేజర్ నరసింహస్వామి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద రూ.436 కట్టి అనారోగ్య కారణంగా చనిపోతే కుంటుంబానికి బీమా పథకం ద్వారా డబ్బులు అందజేయడం జరుగుతుందన్నారు. కౌటాల శాఖలో పొదుపు చేసుకోవడం వలన సక్రమమైన వడ్డీని అందిస్తామన్నారు. బీమా లేని వారు ప్రీమియం చెల్లించి తీసుకోవాలని కోరారు. దీంతో కుటుంబానికి ఆసరాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌటాల శాఖ క్షేత్రాధికారి మనోహర్, అకౌంటెంట్ రాజేష్, క్యాషియర్లు గోపీ, భాస్కర్, బ్యాంకు మిత్ర నీరజ పాల్గొన్నారు.

తెరుచుకున్న పాఠశాలలు

- నవతెలంగాన కథనానికి స్పందన
- సీఆర్పీలతో ప్రారంభం



నవతెలంగాణ-దహెగాం

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విద్యా సంవత్సరం ప్రారంభమైంది. మొదటిరోజు మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు ప్రారంభించి సమావేశాలు నిర్వహించారు. కాగా మండల వ్యాప్తంగా 55 ప్రభుత్వ పాఠశాలకు గాను 14 పాఠశాలలో ఒక్కక్కరే ఉపాధ్యాయులుండగా మరో నాలుగు చోట్ల పూర్తిగా ఉపాధ్యాయులు లేక పోవడంపై బుధవారం 'ముందుచూపు లేని విద్యా శాఖ' అనే శీర్షికతో నవతెలంగాణ కథనం ప్రచురించగా విద్యా శాఖ అధికారులు స్పందించారు. ఉపాధ్యాయులు లేని పోలంపల్లి పాఠశాలకు సీఆర్పీ చంద్ర శేఖర్ వెళ్లి ప్రారంభించగా పానకాల గూడ పాఠశాలకు సీఆర్పీ సంతోష్ ప్రారంభించారు. అదేవిధంగా గొర్రెగుట్ట ప్రాథమిక పాఠశాలకు ఇట్యాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు డిప్యుటేషన్‌పై వెళ్లి ప్రారంభించగా మేకల గూడ పాఠశాలలో విద్యార్థులు లేరని మూసివేశారు. కానీ పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించకపోతే సీఆర్పీలతో ఎన్ని రోజులు పాఠశాలలు నడిపిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

పోడు సాగుదారులపై దాడులు ఆపాలి

- మంత్రికి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కొంతకాలంగా పోడు సాగు చేసుకుని అదే జీవనంగా గడుపుతున్న రైతులపై అటవీ అధికారులు చేస్తున్న దాడులు ఆపాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 20 సంవత్సరాలుగా పోడు సాగు చేసుకుంటున్న రైతులపై అటవీ అధికారులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కాగజ్ నగర్ అటవీ డివిజన్ పరిధిలోని అంకసాపూర్ గ్రామానికి చెందిన రైతులు సర్వేనెంబర్ 145లో 35 సంవత్సరాల నుండి పోడు సాగు చేసుకుంటున్నారని వీటికి 2005లో అప్పటి ప్రభుత్వం పట్టాలు ఇవ్వడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు రైతు బీమా లాంటి ప్రయోజనాలు కూడా పొందారన్నారు. ఇదేవిధంగా ఆసిఫాబాద్ మండలం దానాపూర్, రెబ్బెన మండలంలోని తుంగెడ, కాగజ్‌నగర్ మండలంలోని మోసం, ఆరెగూడ, కడంబా ఇలా అనేక గ్రామాలలో పోడు రైతులపై అటవీ అధికారులు చేస్తున్న దాడులు ఆపాలని మంత్రిని కోరారు. ఒకవేళ ఇదే పరిస్థితి కొనసాగితే రైతులకు అండగా ఉండి పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎండి చాంద్ పాషా, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బండారి తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, పోడు రైతులు పెరుగు లింగయ్య, సిండే పోచయ్య, నికోడే బుద్ధాజి, వడై లక్ష్మణ్, గౌతరే సాంబయ్య, మండూరి నాగేష్, మోర్లే భీంరావు, మండూరి బాబాజీ, శోగల వసంతరావు, ఆదే గణపతి, వడై హరీ రామ్ పాల్గొన్నారు.

సాగు చేస్తున్న భూముల జోలికి వెళ్లొద్దు

- అధికారులకు రాష్ట మంత్రి సీతక్క ఆదేశం
- జిల్లా అభివృద్ధిపై సమీక్ష



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోడు భూముల లొల్లి రోజురోజుకు పెరుగుతోందని ప్రస్తుతం సాగు చేసుకుంటున్న భూముల జోలికి వెళ్లకూడదని కొత్తగా అడవులను నరికి సాగు చేయకుండా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఉట్నూర్ ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, జిల్లా జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, హరీష్ బాబు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండేవిఠల్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్‌తో కలిసి వివిధ శాఖల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోడు సాగుపై అటవీ అధికారులు ఆచితూచి వ్యవహరించాలని, కొత్త పోడు కాకుండా చూడాలని అంతేకానీ ఇప్పటికే సాగులో ఉన్న వాటి జోలికి వెళ్ళకూడదన్నారు. అధికారులు మనసుపెట్టి పనిచేయాలని అప్పుడే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. ఆసిఫాబాద్‌లో పని చేయడానికి అధికారులు కొంత వెనకడుగు వేస్తున్నారని అయితే జిల్లా ప్రాశస్తిని సామాజిక మాధ్యమాల్లో వీడియోల ద్వారా వైరల్ చేయాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్ సెక్షన్ ప్రారంభం కావడానికి జిల్లా అధికారులు లేదా ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని వారికి సంబంధించిన కుటుంబ సభ్యులను ఆస్పత్రిలో ఆపరేషన్ జరిగేలా చూడాలన్నారు. అప్పుడే జిల్లా ఆస్పత్రిపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. జిల్లాలో పనిచేసే వైద్యులకు అధిక మొత్తం ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. ఇదే సందర్భంలో అధికారులు ఇచ్చిన సూచన మేరకు బదిలీల్లో కూడా జిల్లాకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చేలా ముఖ్యమంత్రితో మాట్లాడనున్నట్లు వివరించారు. ప్రస్తుత బదిలీల్లో విద్యాశాఖలో ఎక్కువగా విద్యార్థులు ఉన్నచోట ఉపాధ్యాయుల కేటాయింపు జరగాలని తక్కువ విద్యార్థులు ఉన్నచోట ఆ లెక్క ప్రకారం కేటాయింపు జరిగేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా వర్తి చేసే పోస్టులు జిల్లాలోని నిరుద్యోగులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో వాగులు ఉన్నచోట ఐరన్ బ్రిడ్జిలు నిర్మించే అవకాశం ఉంటే వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులు అప్రమత్తంగా ఉంటూ నకిలీ విత్తనాలు అరికట్టాలని సూచించారు. రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను నాలుగు ఏజెన్సీల ద్వారా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల భవనాలు లీకేజీ ఉంటే కెమికల్ ట్రీట్మెంట్ చేస్తున్నట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు అరికట్టడానికి ప్రతి మండలంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే కోవా లక్ష్మీ మాట్లాడుతూ మన ఊరు మనబడి పాఠశాలల పనులు పెండింగ్ మొత్తాలు రావాల్సి ఉన్నాయన్నారు. ఒకవేళ చెల్లించకుంటే బడులకు కాంట్రాక్టర్లు తాళాలు వేస్తామని బెదిరిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా నుండి వచ్చి అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఇతర జిల్లాలకు చెందిన వారికి జిల్లాలో ఉద్యోగాలు ఇచ్చారన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఒక్క ఆపరేషన్ కాకపోవడం జిల్లా వైద్య శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కై వరి ధాన్యాన్ని అధికారులు బ్లాక్ మార్కెట్లకు పంపించారని ఆరోపించారు. ఆరు నెలల నుండి రహదారులు భవనాల శాఖ కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు రావడం లేదని వెంటనే వాటిని చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంకుసాపూర్ రైతులకు అండగా ఉంటా

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని అంకుసాపూర్ గ్రామ రైతులకు అండగా ఉంటామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు భరోసా ఇచ్చారు. బుధవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. తాము 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పట్టా భూములను ఫారెస్ట్ అధికారులు ప్లాంటేషన్ కోసం సేకరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటామని, 145 సర్వే నెంబర్‌లో ఉన్న దాదాపు 700 ఎకరాల పట్టా భూములు రైతులు సాగు చేసుకోవచ్చని, ఫారెస్ట్ అధికారులు రైతులను భయభ్రాంతులకు గురి చేస్తే ఊరుకునేది లేదన్నారు. పట్టా భూములను కూడా ఫారెస్ట్ అధికారులు కబ్జా చేస్తామంటే రైతులు తిరగబడతారని హెచ్చరించారు. వెంటనే ఇటువంటి దుందుడుకు చర్యలు మానుకోవాలని ఫారెస్ట్ అధికారులకు హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు కొంగ సత్యనారాయణ, విరభద్రచారి పాల్గొన్నారు.

చెట్టు మీద నుండి పడి ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అల్లనేరేడు పండ్ల కోసం పాఠశాల ఆవరణలో ఉన్న చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడి ఇద్దరు విద్యార్థులకు గాయాలైన ఘటన కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (సర్‌సిల్క్)లో బుధవారం జరిగింది. తోటి విద్యార్థులు తెలిపిన ప్రకారం బుధవారం మధ్యాహ్నం 3.15 సమయంలో విద్యార్థులకు విరామం ఇచ్చారు. ఆ సమయంలో పదో తరగతి చదివే ఇద్దరు విద్యార్థులు అవినాష్ మండల్, అంకన్నలు పాఠశాల ఆవరణలో ఉన్న అల్లనేరేడు చెట్టు ఎక్కి పండ్లు తెంపే ప్రయత్నం చేశారు. ప్రమాదవశాత్తు కింద పడడంతో అవినాస్ మండల్ తలకు తీవ్ర గాయమైంది. మరో విద్యార్థి అంకన్నకు రెండు చేతులు విరిగాయి. వీరిని వెంటనే స్థానిక ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. మెరుగైన వైద్యం కోసం అవినాష్ మండల్‌ను మంచిర్యాలకు తరలించారు. అవినాష్ మండల్‌ది కాగజ్‌నగర్ మండలం గువ్వలగూడ కాగా, అంకన్నది పెంచికల్‌పేట్ మండలం. వీరిద్దరూ స్థానిక ఎస్సీ వసతిగృహంలో ఉంటూ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు.



తలకు గాయంతో చికిత్స పొందుతున్న అనీష్ మండల్



రెండు చేతులు విరిగి చికిత్స పొందుతున్న మరో విద్యార్థి అంకన్న

రాజకీయాల కంటే ప్రజల సమస్యలే ముఖ్యం

- రాష్ట్ర మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజకీయాల కంటే ప్రజా సమస్యలే ముఖ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో రూ.25 లక్షల నిధులతో నిర్మించనున్న ప్రెస్ క్లబ్ భవనానికి ఎమ్మెల్యే కోవలక్ష్మి, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణరావ్, డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాల కంటే ప్రజల సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. జిల్లాలో రోడ్డు సౌకర్యం లేని అనేక గ్రామాలు ఉన్నాయని వాటన్నిటికీ మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ప్రజా భావనను విస్తరించడంలో మీడియా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని ఇది తెలంగాణ ఉద్యమంలోనే నిరూపితమైందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన ప్రతి హామీ జిల్లాలో నెరవేరుస్తానని తెలిపారు. అభివృద్ధి చేస్తే ప్రజల మనసుల్లో స్థానం సంపాదించడం సులభమేనన్నారు. ఆసిఫాబాద్ ఎన్నో చారిత్రక ప్రదేశాలకు ఆలవాలంగా నిలుస్తుందని, అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్సీ దండేవిఠల్ మాట్లాడుతూ అభివృద్ధిలో మీడియా ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు.

రామోజీరావుకు నివాళి

ఇటీవల మరణించిన ఈనాడు పత్రిక స్థాపకుడు రామోజీరావుకు మంత్రి సీతక్క ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రామోజీరావు సేవలు కొనియాడారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చరణ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, నాయకులు శ్యామ్, మంగ, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ఆరంభం..అన్నదాత సంబురం..!









వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న అన్నదాతలు ఖరీఫ్ సీజన్‌పై భారీగా ఆశలు పెట్టుకుంటారు. ప్రస్తుతం పంటకాలం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పొలాల్లో అన్నదాతల సందడి కనిపిస్తోంది. జిల్లాను నైరుతి రుతుపవనాలు పలకరించడంతో వరుసగా వర్షాలు వస్తాయనే ఆశతో అనేక చోట్ల విత్తనాలు విత్తుతున్నారు. రైతుల రాకతో మండల, జిల్లా కేంద్రాల్లోని విత్తన, ఎరువుల దుకాణాలతో పాటు పనిముట్ల కొనుగోలుతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. అన్నదాతలు సంతోషంగా పొలం పనుల్లో నిమగ్నమవుతూ సిరుల పంట పండించేందుకు సిద్ధమవుతున్నారు.

-నవతెలంగాణ-దహెగాం







ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్
- కనీస వేతనం రూ.32 వేలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీలో పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి కనీస వేతనం రూ.32వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం అద్దె బస్సు డ్రైవర్లతో కలిసి కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏండ్లుగా ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్లుగా అనేక మంది పనిచేస్తున్నారన్నారు. వీరికి ఎటువంటి ఉద్యోగ భద్రత లేకపోవడం దారుణమన్నారు. అద్దె బస్సు డ్రైవర్లకు కనీస వేతనం రూ.32వేలు చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోకపోతే ఈనెల 14 తర్వాత ఏ క్షణంలోనైనా నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు హెచ్చరించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఆర్టీసీ ప్రయివేట్ బస్ డ్రైవర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆసిఫాబాద్ డిపో అధ్యక్షుడు మధుసూదన్, ఉపాధ్యక్షుడు అయిల్లా భాస్కర్, కోశాధికారి సాయి కృష్ణ, కార్మికులు ఆత్మకూరి సంతోష్, విజయ్, బాలు, కృష్ణ, మొండి, వినోద్, మల్లేశు శ్రీనివాస్, ప్రకాశం, హైమద్, కుమార్, గణేష్, నరేష్ పాల్గొన్నారు.

బాబు ప్రమాణస్వీకారం సందర్భంగా సంబరాలు

నవతెలంగాణ-నస్పూర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో టీడీపీ నాయకులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి రాజు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో టీడీపీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏపీలో చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తెలుగు ప్రజలకు సంతోషకరమైన విషయమని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా తెలుగుదేశం లోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంచె భూపతి, టీడీపీ నాయకులు గరిగంటి రాజయ్య, ఆవుల సుధాకర్, మిడిదొడ్డి మొండయ్య, జువాజీ మల్లేష్, రఘుపతి, నర్సాజి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో మగ శిశువుకు జన్మనిచ్చిన మహిళ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మురిమడుగు గ్రామ పంచయతీ సోముగూడ గ్రామానికి చెందిన మారుబాయి అనే మహిళ బుధవారం 108 వాహనంలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. మారుబాయి పురిటి నొప్పులతో బాధపడుతుంటే మాణిక్ రావు అనే వ్యక్తి 108కు సమాచారం అందించాడు. ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవించినట్లు పైలట్ సంపత్ ఈఎంటీ మునిందర్ గౌడ్ తెలిపారు. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు వెల్లడించారు.

చదువే అన్నింటికీ మూలాధారం

● మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు

నవతెలంగాణ-నస్పూర్

చదివే అన్నింటికీ మూలాధారమని, మనిషి జీవితంలో గొప్ప మార్పుకు చదువు మాత్రమే ప్రధానమని నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు అన్నారు. 2024-25 విద్యా సంవత్సరం పాఠశాలల పునఃప్రారంభంలో భాగంగా బుధవారం సీతారాంపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు పద్మజతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందనని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు నిష్ణాతులై, అనుభవజ్ఞులై ఉంటారని, విద్యార్థులు చదువులో రాణించేందుకు తల్లిదండ్రులు తమ వంతు ప్రోత్సాహం అందించాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల శిక్షణలో విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో రాణిస్తూ సమాజంలోని ప్రతి అంశంపై అవగాహన పెంచుకొని సుశిక్షితులవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నారం : విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్‌రావు కోరారు. పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం మండలంలోని పోన్కల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు బుక్స్, స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. విద్యార్థులు శ్రద్ధతో బాగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జాజాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో పుస్తకాలు అందజేత

మండలంలోని తిమ్మాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఆ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం ఉదయం ఆయన పాఠశాలకు వచ్చిన పలువురు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ అందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వీఓ లీడర్లు ఉన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం మొదటి రోజు ప్రారంభం అయ్యాయని ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు.



నస్పూర్‌లో..

తాండూర్ : ప్రభుత్వ పాఠశాలలో అత్యున్నతమైన విద్యాబోధనతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందజేయడం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం తాండూరు మండలంలోని మాదారం ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ ప్రభాకర్‌తో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ప్రభుత్వం ఉచిత దుస్తులు పాఠ్యపుస్తకాలతో పాటు విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సందేహాలు విడనాడి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు ఆసక్తి కనబరచాలన్నారు. గత సంవత్సరం తాండూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నతమైన ఫలితాలు వచ్చాయని తెలిపారు. తాండూర్ కస్తూర్బా పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా రాష్ట్రస్థాయిలో ర్యాంకులు పొందారన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజ్ఞావంతులైన ఉపాధ్యాయులు క్రమశిక్షణ ఆటపాటలతో కూడిన విద్యా బోధన చేస్తున్నారని ఆయన వివరించారు. ఉపాధ్యాయులు ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు రవీందర్‌రెడ్డి, యశోద, ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, అంగన్వాడీ ఆశా కార్యకర్తలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

పాఠశాలలకు పునః ప్రారంభం సందర్భంగా రేచీని రోడ్డు, కస్తూర్బా, పీఎస్‌యూపీఎస్, హై స్కూల్స్‌లలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. పాఠశాలలను శుభ్రపరిచి పూలమాలలతో మామిడి తోరణాలతో అలంకరించారు. విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఏకరువుప దస్తులను పాఠ్యపుస్తకాలను అందించారు. ప్రభుత్వం పాఠశాలల్లో స్కావెంజర్లు నియమించకపోవడం వల్ల పాఠశాలలను శుభ్రపరిచే విషయంలో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దండేపల్లి : కొత్త హంగులతో ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపు దిద్దుకున్నాయని ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ప్రభుత్వ నుంచి సరఫరా అయిన ఏక రూప దుస్తులు, పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తుందని పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించారని ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ద్వారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏక రూప దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.



జన్నారంలో..



తాండూర్‌లో..



దండేపల్లిలో..

నకిలీ వైద్యులపై కొరడా ఝుళిపిస్తున్న అధికారులు

నవతెలంగాణ-నస్పూర్

చట్ట విరుద్ధంగా నడిపిస్తున్న నకిలీ వైద్యులపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. టీజీఎంసీ, ఎన్ఎంసీ బృందం ఇటీవల మంచిర్యాల జిల్లాలోని నస్పూర్, శ్రీరాంపూర్, మందమర్రి, నీల్వాయిలో నకిలీ వైద్యులను గుర్తించారు. వారిపై ఎఫ్ఐఆర్, 91 సీఆర్పీసీ కేసులు నమోదు చేశారు. అర్హత లేని వాళ్లు వైద్యం చేస్తూ వివిధ రకాల మోతాదుకి మించిన యాంటీబయాటిక్స్, నొప్పి మందులు ఇస్తూ ప్రజలను అనారోగ్యంపాలు చేస్తున్నారని గుర్తించారు. ఇలా మోతాదుకు మించిన అంటిబయోటిక్ వాడడం వలన సూపర్బగ్ అభివృద్ధి చెంది ఎటువంటి మందులకు లొంగని వ్యాధులు వస్తాయని వైద్యులు (టీజీఎంసీ, ఎన్ఎంసీ) తెలిపారు. అదేవిధంగా నకిలీ వైద్యులు నడుపుతున్నటువంటి క్లినిక్‌లకు ఎటువంటి శాఖపరమైన అనుమతులు లేవని, వాళ్లు సరైన బయో మెడికల్ వేస్ట్ నియమాలను పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో చలగటం ఆడుతున్నారని తెలిపారు. నకిలీ వైద్యులపైన టీజీఎంసీ, ఎన్ఎంసీ నిబంధనలకు లోబడి ఎంఎంసీ సెక్షన్ 34/54 ప్రకారం, 91 సీఆర్పీసీ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సామాగ్రి అందజేత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ 3వ అంగన్‌వాడీ కేంద్రంలో దేవాపూర్ ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం రూ.లక్ష విలువ గల సామాగ్రి పంపిణీ చేశారు. బుధవారం దేవాపూర్ 3వ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవాపూర్ ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా మేనేజర్ అరుణ్ కుమార్ దాస్ చేతుల మీదుగా అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ, వాటర్ ప్యూరిఫై, కుక్కర్, స్లైడ్ కుర్చీలు, ఆట వస్తువులు తదితర రూ.లక్ష విలువ గల సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ టీచర్ స్వరూప రాణి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం వేణుమాధవ్, సిబ్బంది కిష్టమ్మ, మాజీ వార్డు సభ్యులు చేర్ల లక్ష్మణ్, పోతు సంతోశ్, చిన్నారులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విచారణపై పరిష్కారం వచ్చిన తర్వాత సభ్యత్వానికి అవకాశం

● జిల్లా మత్స్యశాఖ అధికారి డి.సత్యనారాయణ

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని చెన్నూర్ పెద్ద చెరువులో సభ్యత్వం విషయంలో హైకోర్టు విచారణ జరుగుతున్న నేపథ్యంలో తీర్పు వచ్చాక సభ్యత్వానికి అవకాశం ఇస్తామని జిల్లా మత్స్యశాక అధికారి డి సత్యనారరాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు గడ్డం వివేక్‌తో సమావేశంలో చెన్నూర్ పెద్ద చెరువులో చేపల వేట విషయంలో ముదిరాజ్, గంగపుత్రుల మధ్య కొనసాగుతున్న వివాదం హైకోర్టు విచారణ అనతంరం చెరువు శిఖం ఆధారంగా ముదిరాజ్‌లకు సభ్యత్వం కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేత

నవతెలంగాణ-మందమర్రి

మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆదర్శ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను యూనిఫామ్‌లను అందచేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా సుమారు రూ.11 లక్షల 60 వేలతో చేపట్టిన మరమ్మతు పనులను కమీషనర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి, మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్యామ్ సుందర్, టీఎంసీ మెప్మా ఇన్‌చార్జి రఘురాం, ఉపాధ్యాయులు పుష్పల, విజయనిర్మల పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వృద్ధునికి జైలు

నవతెలంగాణ-దండేపల్లి

గతంలో నాటు సారా కాస్తు పట్టుబడ్డ మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రాగం ధర్మయ్య అనే వృద్ధున్ని బైండోవర్ ఉల్లంఘించిన కేసులో జైలు శిక్ష విధించారు. గతంలో నాటు సారకాస్తు పట్టు పడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి రూ.లక్ష పూచికత్తుతో విడుదల చేశారు. కాని మళ్లీ అదే నాటు సారా కాస్తు పట్టబడి బైండోవర్ ఉల్లంఘించడంతో రెవెన్యూ అధికారులు రూ.లక్ష జరిమానా చెల్లించాలని నోటీసులు జారీ చేసిన పట్టించుకోకపోవడంతో తహసీల్దార్ సంధ్యారాణి ఆయనకు జైలు శిక్ష విధించి జైలుకు తరలించినట్లు లక్షట్టిపేట ఎక్సైజ్ సీఐ పి నర్సింలు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నాటు సారా కాయడం నేరమని ఎవరైనా నాటు సారా కాస్తే చట్టరీత్య శిక్షార్హులవుతాదని పేర్కొన్నారు. నాటు సారా కాస్తున్నట్లు సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

కాసిపేట-1, 2 గనులపై ధర్నా



నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి ఏరియా హాస్పిటల్‌ను నిర్వీర్యం చేసే సింగరేణి యాజమాన్యం విధానాలకు వ్యతిరేకంగా మందమర్రి ఏరియా కాసిపేట-1, 2 గనుల పై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన, ధర్నాలు చేసి మేనేజర్లకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల కోసం క్లర్క్ పోస్టులు ఎలక్ట్రీషన్, ట్విట్టర్ మైనింగ్ స్టాఫ్ ఉద్యోగాలు ఏపీ ఆపరేటర్ పోస్టులు కొత్తగూడెంలో డైరెక్టర్లతో మాట్లాడి ఇప్పించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం సింగరేణి లాభాలల్లో 35 శాతం కార్మికులకు వాట ఇవ్వాలన్నారు. కార్మికుల కోసం రెండు గంటల స్థలం, వడ్డీ లేని రుణం ఇవ్వాలన్నారు. భూగర్భగనులను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సాలేంద్ర సత్యనారాయణ, సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్ అలీ, సురేష్ని,హెచ్ లింగయ్య, ఐ సంపత్ కమలాకర్, ఆడెపు రవీందర్‌లు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

నవతెలంగాణ-జైపూర్

వన్యప్రాణుల సంరక్షణతోపాటు ఆవాసయోగ్యాలను గుర్తింన అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో జైపూర్-భీమారం మండల సరిహద్దు కుందారం రక్షిత అటవీ ప్రాంతం చెన్నూర్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా 19 చుక్కల దుప్పులను వదిలారు. వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ ఎంసీ పార్గెయిన్ ఎఫ్డీపీటీ కవ్వాల్ టైగర్ రిజర్వ్ శాంతారాం ఆదేశాల మేరకు మంచిర్యాల డీఎఫ్ఓ శివ్ ఆశీష్ సింగ్, ఎఫ్‌డీఓ వినయ్ కుమార్ సాహూ ఆధ్వర్యంలో మంచిర్యాల రేంజ్ చెన్నూర్ కారిడార్ అటవీ ప్రాంతంలో చుక్కల దుప్పులను వదిలారు. కాగా హైదరాబాద్‌లో గల మహవీర్ వనస్థలి నేషనల్ పార్క్ నుండి చుక్కల దుప్పులను ఇక్కడికి తరలించినట్లు అటవీ అదికారులు తెలిపారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్, మంచిర్యాల చెన్నూర్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా రక్షిత అటవీ ప్రాంతంలో చుక్కల దుప్పుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (అటవీ క్షేత్రాధికారి) రత్నాకర్ రావు, డిప్యూటీ ఎఫ్ఆర్వో సాగరిక, ఎఫ్‌బీఓ దీక్ష పాల్గొన్నారు.

మల్లె తోటల పెంపకంతో అధికాదాయం

నవతెలంగాణ-తాండూర్

ఇంటి ఆవరణలోని పేరటి భూముల్లో మల్లె తోటల పెంపకం చేపట్టి అధిక ఆదాయాన్ని పొందవచ్చునని బెల్లంపల్లి ఉద్యానవనాధికారి సుప్రజ తెలిపారు. బుధవారం మండలంలోని బోయపల్లి గ్రామంలోని రైతులు మాసాడి తిరుపతి, శ్రీరాములుమల్లె తోటలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్లెపూలు వ్యవసాయ పనుల విరామంలో దిగుబడి రావడం వల్ల వ్యవసాయానికి ఆటంకం కలగకుండా ఇంటిల్లిపాదికి ఉపాధి కలుగుతుందని తెలిపారు. ఎండాకాలం మల్లెపూల దిగుబడి సమయంలో వివాహాది శుభకార్యాలు పండుగలు జాతరలు జరుగుతున్నందున మల్లెపూలకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. ఒకసారి నాటిన మల్లె తోట నుంచి 12 సంవత్సరాల వరకు దిగుబడులు పొందవచ్చని తెలిపారు. నీటి వసతి గల ఉత్సాహవంతులైన రైతులు మల్లెతోటలపై ఆసక్తి కనపరచాలని సూచించారు. ప్రస్తుతం మల్లె తోటలలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల కోసం రైతులకు వివరించారు. ప్రస్తుతం మల్లెతోటలలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రసం పీల్చే పురుగుల ఉధృతి వలన మల్లెపూలు రంగు మారి మార్కెట్లోగిట్టుబాటు ధర పలుకావని తెలిపారు. రైతులు రసం పీల్చే పురుగుల నివారణకు డైయాక్లోప్రిడ్, ప్రోషినోవాస్ సోమ్ నిడ్ కెర్నల్, మార్చి పిచికారి చేయాలని తెలిపారు.

'క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి'

నవతెలంగాణ-జన్నారం

క్రీడలు శారీరక ధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని రేండ్లగూడ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రూబెన్, మంచిర్యాల జిల్లా నాయకుడు బోర్లకుంట ప్రభుదాస్ అన్నారు. బుధవారం మండలంలోని రేండ్లగూడలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు బోర్లకుంట సాగర్ బహుమతి ప్రధానం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు రేండ్లగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాలలో ఈజీఎస్ పనులపై నిర్వహించే సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్డీఏ అడిషనల్ పీడీ, ఎంపీడీఓ శశికళ సూచించారు. గ్రామ స్థాయిలో సోషల్ ఆడిట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గురువారం నుండి అన్ని గ్రామాలలో సోషల్ ఆడిట్ జరుగుతుందని వెల్లడించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ రమేష్, ఏపీఓ రవీందర్ పాల్గొన్నారు.

కార్డెన్‌సెర్చ్‌తో నేరాల నియంత్రణ సాధ్యం

● జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-జైపూర్



నేరాలను నియంత్రించడానికి గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించే కార్డెన్‌సెర్చ్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందని, ఈ కార్యక్రమాల ద్వారా నేరాలు నియత్రించడం సాధ్యమవుతుందని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం భీమారం మండలం భూర్గుపల్లిలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. శ్రీరాంపూర్ సీఐ మోహన్ ఆధ్వర్యంలో భీమారం ఎస్సై రాములుతో కలిసి ఎక్సైజ్ అధికారులు భూర్గుపల్లి శివారుల్లో గల గుడుంబా స్థావరాలను గుర్తించారు. ఈ సంధర్భంగా 17 లీటర్ల గుడుంబాతో పాటు 1200 లీటర్ల బెల్లంపాకం ధ్వంసం చేశారు. ప్రజల రక్షణ భద్రత పోలీసుల బాధ్యత కాని గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్థులు షెల్టర్ తీసుకుంటున్నట్లు తెలిస్తే తప్పకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని 100 నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్ కాల్స్‌లకు స్పందించవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహణాలు నడిపేటప్పుడు తప్పకుండా హెలిమేట్ ధరించాలని, అవసరమైన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఇందుకోసం పోలీసుల సహాయ సహకారం ఉంటుందని అన్నారు. భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యమంలో శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్, జైపూర్ ఎస్సై నాగరాజు, ఏఎస్సై శకుంతల, సంపూర్ణ, మాచర్ల, ముత్తయ్య, మహేష్ బాబు, సంతోష్, ఎక్సైజ్ సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల ధర్నా



నవతెలంగాణ-వేమనపల్లి

ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుండగా మండలంలోని రైతాంగానికి అవసరమైన ఎరువులు నిల్వలు లేవని బుధవారం రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కలెక్టర్ రైతులకు వానాకాలానికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించామని కొరత లేకుండా చూస్తామని అన్నారు. కాని వేమనపల్లి మండలంలో ఇందుకు భిన్నంగా ఉంది. ముఖ్యంగా మండల కేంద్రముతో పాటు గొర్లపల్లి, కల్మలపేట, కేతనపల్లి శివారులో అత్యధికంగా పత్తి మిర్చి పంటలు సాగు చేస్తారు. ఈ శివారులో పత్తి చేళ్ల వైపు రోడ్ల సౌకర్యం లేక వర్షం పడితే రోడ్డు బురదమయంగా మారే పరిస్థితి ఉంది. పత్తి మిర్చి పంట సాగుకు అవసరమయ్యే యూరియా, డిఏపి, కాంప్లెక్స్ చెరువులను రైతులు ముందస్తుగా చేళ్లలోకి తరలించి, చేళ్ళ గట్లపై పెట్టుకొని వర్షాలకు తడవకుండా ప్లాస్టిక్ కవర్లతో కట్ట కట్టి నిల్వ ఉంచుకుంటారు. కాని మండలంలో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులందరూ కలిసి వ్యవసాయ శాఖ అధికారికి ఫోన్ చేయగా ఫోన్ లేపడం లేదని భీమిని ఏడిఏ ఇథియాజ్ మహమ్మద్‌ను ఫోన్‌లో సంప్రదించగా వేమనపల్లి మండలం నుండి వ్యవసాయశాఖ అధికారి రైతులకు అవసరమైన ఎరువులు కావాలని తమ దృష్టికి తీసుకు రాలేదని అన్నారని దీంతో రైతులు వ్యవసాయ శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్రంలోని 3 క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు మండల, జిల్లా స్థాయి లలో ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజ్వీరు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని, అభ్యర్థులు సెప్టెంబర్ 1, 2015 నుంచి ఆగస్టు 31, 2016 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 28వ తేదీన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో, మండల స్థాయిలో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు మండల విద్యాధికారులు నిర్వహిస్తారని తెలిపారు. మండల స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, మండల రెవెన్యూ, విద్య శాఖల అధికారులు, పీడీలు, పీఈటీలు ప్రతి మండలం నుంచి 10 పాయింట్లకు తగ్గకుండా ఉన్న వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపించాలని, జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని జూలై 7, 8 తేదీలలో మేడ్చల్ జిల్లాలోని హకీంపేటలో జరుగనున్న పోటీలకు పంపించడం జరుగుతుందని, జిల్లా నుంచి 20 మంది బాలురు, 20 మంది బాలికలకు ఎంపిక పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను రాష్ట్రంలోని మేడ్చల్ జిల్లాలో గల హకీంపేట క్రీడా పాఠశాల, కరీంనగర్‌లోని రీజనల్ క్రీడా పాఠశాల, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి సరికాదు

నవతెలంగాణ-ఉట్నూర్



యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ గ్రామానికి ఫొటోగ్రాఫర్‌పై దాడి సరికాదని ఫోటోగ్రాఫర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరికంటి మహేష్ అన్నారు. బుధవారం దాడిని ఖండిస్తు ఐబీ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలు తెలిపారు. పుటపాక గ్రామంలో ఓ ఫంక్షన్‌లో ఫోటోగ్రాఫర్ లింగుస్వామిపై తన ఫోన్‌లో ఫోటోలు తియలేదని దౌర్జన్యం చేసి దాడి చేయడం మంచిది కాదన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దొడ అశోక్, ఉట్నూర్ మండల అధ్యక్షుడు చవాన్ సేవాదాస్, ప్రధాన కార్యదర్శి రుబెన్ రాజ్ కుమార్, మాధవ్ రావు, సునీల్, మారుతి పాల్గొన్నారు.

ఆర్ఎంపీలపై డీఎంఈ దాడులు నిలిపి వేయాలి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

ఆర్ఎంపీలపై డీఎంఈ దాడులు నిలిపి వేయాలని మండల ఆర్ఎంపీలు కోరారు. డీఎంఈ దాడులకు నిరసనగా ఆరు రోజులుగా స్వచ్ఛందంగా తమ క్లినిక్‌లు మూసివేసి ఆర్ఎంపీలు నిరసన తెలుపుతున్నారు. బుధవారం నిరసన కార్యక్రమం ముగింపు చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీనియర్ గ్రామీణ వైద్యుడు చంద్రగిరి తులసి దాస్ మాట్లాడుతూతమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ పేద గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిలో మనో ధైర్యాన్ని నింపుతూ కంటికి రెప్పలా వారిని కపడుకున్నమన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శంకర్, హేమాజీ, అమృత్ సర్కార్, ఉమేష్, రతన్, అజ్జు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మహిళ మృతి

- వైద్యుని నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో బుధవారం మహిళ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన వివాహిత బడికెల కృష్ణవేణి(27) మూడు రోజుల క్రితం అనారోగ్యంతో స్థానిక మణికంఠ నర్సింగ్‌హోంలో చేరింది. రక్తకణాలు తక్కువగా ఉన్నాయంటూ చికిత్స ప్రారంభించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వైద్యుని నిర్లక్ష్యం కారణంగానే కృష్ణవేణి మృతి చెందిందంటూ మృతురాలి బంధువులు ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ సోనియాలు అక్కడికి వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం ఆరోగ్యంగానే ఉన్న కృష్ణవేణికి మధ్యాహ్నం సిబ్బంది ఇంజక్షన్ వేశారని, తర్వాత అరగంట వ్యవధిలోనే ఆమె మృతి చెందిందని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుడు శివదర్శన్‌ను కలిసి మృతురాలికి అందించిన చికిత్సల గురించి తెలుసుకున్నారు. రెండు గంటల ఆందోళన అనంతరం మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తానని వైద్యుడు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. మృతురాలికి భర్త బడికెల పర్వతాలు, కూతురు కావ్యశ్రీ, కుమారుడు శివతేజ ఉన్నారు. కాగా వైద్యుడు శివదర్శన్‌ను వివరణ కోరగా అనారోగ్యంతో ఆమె మృతి చెందిందని తెలిపారు.

ట్రైనీ మైనింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ బీటెక్ (మైనింగ్) ఫైనల్ ఇయర్ చదువుతున్న వారికి మేనేజ్మెంట్ ట్రైనీ మైనింగ్ ఉద్యోగానికి ధరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించిందని జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ బీఆర్ దీక్షితులు తెలిపారు. బీటెక్ (మైనింగ్) ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు 13నుండి 19 వరకు సింగరేణి సంస్థ వెబ్‌సైట్ ఎస్‌సీసీఎల్‌మైన్స్.కాంలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సింగరేణి పాఠశాలను సందర్శించిన తహసీల్దార్

నవతెలంగాణ-రెబ్బెన

గోలేటిలోని సింగరేణి పాఠశాలను తహసీల్దార్ జ్యోత్స్న బుధవారం సందర్శించారు. గతేడాది పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులకు పుష్పాలు అందించారు. క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని విద్యార్థులకు చెప్పారు. పాఠశాలలో వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ ఎస్టేట్ అధికారిణి నవనీత, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, ప్రధానోపాధ్యయుడు సంతోష్, పీఈటీ భాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని వంతెనలు రహదారులు లాంటి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. బుధవారం మండలంలోని మోతుగూడ, అప్పపెల్లి గ్రామాల మధ్యలో గల వాగుపై రూ.కోటి 82 లక్షలతో నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులను మంత్రి ధనసరి అనసూయ సీతక్క జడ్పీ చైర్మన్ కృష్ణారావు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్ బాబు, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరివేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వంతెన పనులను సత్వరమే పూర్తిచేయాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో ఇరు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వంతెన నిర్మాణంలో నాణ్యత లోపించకుండా చూడాలన్నారు.



గదులను ప్రారంభించిన మంత్రి..

అనంతరం ఆసిఫాబాద్ మండలంలోని వాడిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల కింద రూ.6 లక్షల 20 వేలతో నిర్మించిన గదులను మంత్రి ప్రారంభించారు. ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభమయ్యాయన్నారు. అర్హత గల బాలలందరు బడిలోనే ఉండాలని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల కింద ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడంతో ప్రయివేటుకు ధీటుగా మారాయని చెప్పారు. ప్రతి పాఠశాలలోనూ తాగునీరు, విద్యుత్తు, టాయిలెట్లు, ఫ్యాన్లు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లయ్యారని పట్టుదల, నిబద్ధత ఉంటే ఏదీ అసాధ్యం కాదన్నారు. 6 నుండి 14 ఏండ్లలోపు బడీడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. అంగన్‌వాడీలలో కూడా ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెడుతున్నట్లు, రెండున్నర సంవత్సరాల పిల్లల్ని నర్సరీ, 3,4 సంవత్సరాల పిల్లల్ని ఎల్కేజీ, 4,5 సంవత్సరాల పిల్లల్ని యూకేజీగా విభజించి వారికి పూర్వ ప్రాథమిక విద్య అనుభూతులు అందించడం జరుగుతుందని తెలిపారు. దీనికోసం మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ అన్ని స్థాయిలలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వనుందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు పాటుపడాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. పాఠశాల తరగతుల పున:ప్రారంభం సందర్భంగా స్థానిక పెట్రోల్‌పంపు ఏరియాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేకు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. బడీడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, అది కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉండాలని సూచించారు. ప్రయివేట్ పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కావన్నారు. అనంతరం పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సురేష్ కుమార్, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ప్రధానోపాధ్యాయులు వెంకట్రాజం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునీత, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో...

ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో కూడా బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు ఏకరూప దుస్తులతో పాటు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ స్వామిశెట్టి రాజేందర్, కౌన్సిలర్‌లు కీర్తి రేఖ, పిర్సింగుల జయచందర్, ప్రధానోపాధ్యాయులు దేవాజీ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సబేరాబేగం పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో కూడా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజేందర్, కౌన్సిలర్ పి.జయచందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గిరుగుల లక్ష్మి, హెచ్‌ఎం శ్రీలత పాల్గొన్నారు.



విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, అధికారులు



జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దాం

- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ

నవతెలంగాణ-వాంకిడి



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాను సమిష్టి కృషితో అన్ని రంగాలలో అభివృద్ధి చేద్దామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా మండలంలోని సవాతి గ్రామంలో రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించినంతరం రాయి సెంటర్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పున ప్రారంభించడం జరిగిందని, విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ఏకరూప దుస్తుల తయారీలో స్వయం సహాయక సంఘాల మహిళలకు అవకాశం కల్పించడం జరిగిందని, ఇదే క్రమంలో రాయిసెంటర్ పరిధిలోని మహిళలకు అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి మండల స్థాయి అధికారులకు తగు ఉత్తర్వులు జారీ చేస్తామని, రాయిసెంటర్ నిర్వహణకు విధివిధానాలను రూపొందించి పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఆదివాసీల అభివృద్ధికి ఎంతో కృషి చేసిన హైమన్ డార్ఫ్ పేరుతో వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఆదివాసుల సంస్కృతిసాంప్రదాయాలను ప్రతి ఒక్కరు కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, రాయిసెంటర్ పెద్దలు, పటేళ్లు, సార్మెడీలు, అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా పాఠశాలలు ప్రారంభం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని వడూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. పదవ తరగతిలో వడూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు పద్మావతి, హర్షిత, శ్రీనిధి 9.0 జీపీఏ సాధించడంతో వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ భూమారెడ్డి, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎంపీడీఓ రాజ్‌వీర్, ఎంఈఓ లక్ష్మణ్, ఎంపీటీసీ పండరి, నేరడిగొండ వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఏపీఓ వసంత్, ఏపీఎం రాథోడ్ ఉత్తం, ప్రముఖ వ్యాపారస్తులు నాయుడు శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జైనథ్ : మండలంలోని కాన్పమేడిగూడ రోడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత, మండల పరిషత్ పాఠశాలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ సందర్భంగా విద్యార్థులకు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య బడికి వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో ఆట పాటలు, రంగురంగు ముగ్గులు వేశారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం అందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యవాన్ చిక్టే, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కొనిగెల నారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సుజాత, మాజీ చైర్మన్ పోలవేణి అడేల్లు, ఉపాధ్యాయురాలు జ్యోతి, వసుధ, మంజుష, సంతోష్, దేవిదాస్, భావానీ ఆనంద్, ప్రకాష్, పెంటపర్తి ఊశన్న, భూమయ్య గ్రామస్తులు మమత, రమేష్, లక్ష్మి పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : బడిడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు ప్రభుత్వం కల్పించిందని, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయివేటు పాఠశాలలో పిల్లలను చేర్పించకుండా ఉచితంగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని మావల మండలం బట్టిసావర్గం పాఠశాలలో బుధవారం మావల ఎంపీపీ దర్శనల సంగీత ఏవన్ ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. రూ.లక్ష నిధులతో నల్లలు ప్రారంభించారు. దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రాజలింగు, ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ, పాఠశాల హెచ్‌ఎం కలమ్మ, యువ నాయకులు గోవర్ధన్, ఉపాధ్యాయులు రవికుమార్, రాజన్న, విద్యా కమిటీ చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధిత్యనగర్‌లో..

మావల మండలంలోని బట్టిసావర్గం పరిధిలో 12వ వార్డ్ ఆదిత్యనగర్ కాలనీలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగరాజు వేముల పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు బాగున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, రిటైర్డ్ హెచ్‌ఎం శ్రీధర్, రంజిత్ రెడ్డి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

యాపల్‌గూడలో...

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని యపల్‌గూడ పాఠశాలలో బుధవారం ఆదిలాబాద్ ఎంపీపీ గండ్రత్ రమేష్ పలు పనులను ప్రారంభించారు. గతంలో ఎంఎంబీ ద్వార పాఠశాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, అమ్మ అధర్శ పాఠశాల కార్యక్రమంలో చేపట్టిన పనులు పూర్తి కావడంతో ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాలలో బోరింగ్ ప్రారంభించి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం ముజఫార్ హుస్సేన్,



నేరడిగొండ

ప్రయిమరీ స్కూల్ హెచ్‌ఎం గంగన్న, ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి, ఎంపీఓ వెంకటరాజు, పాఠశాల కమిటి చైర్మన్ పార్వతి, జయంత్, కిష్టయ్య, భూమన్న, సంతోష్, దీపక్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు సునీత, గంగమ్మ పాల్గొన్నారు.

పెంచికల్ పేట్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ ఆల్బర్ట్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లతో కలిసి ఏకరూప దుస్తులను, పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, మధ్యాహ్న భోజనంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య బోధన చేస్తారని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత శిఖరాలను అవరోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గంగాసింగ్, కాంప్లెక్స్ ప్రాధానోపాధ్యయురాలు విజయనిర్మల, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌటాల : 2024-25 విద్యా సంవత్సరం బుధవారం ప్రారంభమైంది. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడాలని రెండు నెలల క్రితమే అమ్మ ఆదర్శ పాఠశాలల నిధులు మంజూరు చేసింది. కాని మండలంలోని ప్రాథమిక పాఠశాలలో వంద శాతం పనులు పూర్తి కాలేదు, అరకొర వసతుల మధ్యలోనే బుధవారం బడులు ప్రారంభించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏక రూప దుస్తులు, పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను పనులకు తీసుకెళ్ల కుండా బడికి పంపాలన్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు గావుడె హనుమంతు, నారాయణ సింగ్, నానాజీ అరుణ్ కుమార్ ఉన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ఉన్నత పాఠశాలలో తొలి రోజు బుధవారం ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, జడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి ముఖ్య అధితులుగా హాజరై విద్యార్థులకు అందించారు. ఇందులో గ్రామ కార్యదర్శి ఆసిఫ్ ఆలీ, ప్రధానోపాధ్యాయులు జయరాజ్, ఉపాధ్యాయులు ఆత్మారాం పాల్గొన్నారు. మండలంలోని డబ్బా గ్రామంలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాల ప్రారంభోత్సవ వేడుకలకు ప్రత్యేక అధికారి, డిప్యూటీ తహసీల్దార్ మస్కూర్ అలీ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా పూర్తైన 4 యూనిట్స్ విద్యుదీకరణ పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

రెబ్బెన : ప్రభుత్వ పాఠశాలలో ఐకేపీ మహిళా గ్రూప్‌ల ద్వారా యూనిఫామ్‌లు ప్రభుత్వ ఆదేశానుసారం కుట్టించి ఇవ్వడం జరిగిందని ఎంపీపీ సౌందర్య అన్నారు. అన్నారు. బుధవారం మండలంలోని పాఠశాలలో తొలి రోజు విద్యార్థులకు యూనిఫాంలను అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేమూర్ల సంతోష్, కో ఆప్షన్ జవురుద్దీన్, ఐకేపీ అధ్యక్షురాలు వేమూర్ల అమృత, హెచ్‌ఎం విజయ రాణి, ఏపీఎం వెంకట రమణ, ఉపాధ్యాయులు పాలుగున్నారు

లోకేశ్వరం : మండలంలోని మన్మద్ గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో బుధవారం మండల విద్యాధికారి ఎంఈఓ చంద్రకాంత్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత భోజన్న, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. ప్రభుత్వం విద్యాసంస్థలపై విద్యార్థులు తల్లిదండ్రులు నమ్మకం పెరిగేలా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు సుభాష్, మహిళా సంఘ సభ్యురాలు స్వరూప, నాయకులు శ్రీకాంత్, గాజుల సత్యనారాయణ, జయరాజ్ పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్



చింతలమానేపల్లి



పెంచికల్‌పేట్



ఆదిలాబాద్‌రూరల్